సాక్షి
పెద్దపల్లి

సోమవారం । 19 । జూన్ । 2023



చెరువులు, కుంటలు కబ్జా

తెలంగాణ వచ్చాక మారుమూల ప్రాంతంలో కూడా భూముల ధరలు అమాంతం పెరిగాయి.

IIలో ▸



రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం 41.0/31.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రోజంతా ఎండ తీవ్రత కొనసాగుతుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తులు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చి పూజలు చేశారు. పూజారుల నుంచి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఒగ్గు పూజారులచే స్వామివారికి పట్నాలు వేశారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ పాలకవర్గం పర్యవేక్షించింది.

ఐటీఐలో ప్రవేశానికి నేడు చివరి గడువు



పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటిఐ భవనం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశం పొందగోరే విద్యార్థులు ఈనెల19 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నర్సింహచారి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి తొలివిడత ప్రవేశాల దరఖాస్తులను ఈనెల 19వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ ఐటీఐలలో ఎక్కువ ట్రేడ్‌లలో ఆప్షన్లు ఇచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

26 వరకు రామగిరి, సింగరేణి రైళ్లు రద్దు

ఓదెల: కాజీపేట, భద్రాచలంరోడ్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా సెక్షన్ల మధ్య నడిచే రామగిరి, సింగరేణి రైళ్లను ఈనెల 26వరకు రద్దు చేసినట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఆయా సెక్షన్ల మధ్యలో మూడో రైల్వేలైన్ మరమ్మతులు చేస్తున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్, ఇంటర్‌సిటీ రైళ్లు మాత్రం యథావిధిగా నడుస్తాయని తెలిపారు.

నేడు హరితోత్సవం

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం హరితోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. సిరిపురంలోని సుందిళ్ల బ్యారేజీవద్ద, మేడారం పంప్‌హౌజ్ వద్ద, కన్నాలలోని అటవీ ప్రాంతంలో, సుల్తానాబాద్ మినీస్టేడియం ప్రాంతంలో, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో మొక్కలను నాటి పర్యావరణ సంరక్షణకు పాటుపడదామని కలెక్టర్ పేర్కొన్నారు.

హరితోత్సవానికి ఉత్తమ పంచాయతీగా దుబ్బపల్లి

మంథని: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నిర్వహించే హరితోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి మంథని మండలం దుబ్బుపల్లి ఎంపికైంది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ నరేశ్‌రావు, జూనియర్ పంచాయతీ కార్యదర్శి నవీన్‌కు ఆహ్వానం అందింది. హరితహారంలో విజయం సాధించిన పంచాయతీల నుంచి జిల్లా ఈ గ్రామాన్ని నామినేట్ చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

సుల్తానాబాద్: బీజేపీని బూత్‌స్థాయి నుంచి పటిష్ట పర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. ఆదివారం బూత్ కమిటీల అధ్యక్షులను నియమించారు. కేంద్ర పథకాలను ఇంటింటా ప్రచారం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతి, అక్రమాలపై ఉద్యమించాలని తెలిపారు. రిటైర్డ్ ఉపాధ్యాయురాలు వనజ రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మన్‌కీబాత్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. బూత్ అధ్యక్షులు చిట్టవేణి సదయ్య, వనజ, సుంక శ్రీశైలం, పంతంగి శ్రీకాంత్‌ను సన్మానించారు. పార్లమెంటరీ విస్తరక్ సురేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రం, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, రాహుల్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలకరించని తొలకరి



ఎండిపోతున్న పత్తి మొక్కలు

- దంచికొడుతున్న ఎండలు
- ఎండిపోతున్న పత్తి మొక్కలు
- చినుకు కోసం రైతుల ఎదురుచూపు
- సాగు ఆలస్యమవుతుందని ఆందోళన

సుల్తానాబాద్: వానాకాలం సీజన్ మొదలైందంటే చాలు అన్నదాతల్లో ఆనందం కనిపిస్తుంటుంది. వర్షాలు కురిస్తే వెంటనే సాగు పనులు ప్రారంభించడం.. విత్తనాలు వేయడం వంటి పనుల్లో రైతులు బిజీబిజీగా గడుపుతుంటారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఇప్పటికే తొలకరి జిల్లాను పలకరించాల్సి ఉంది. కానీ.. వానకాలం సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఒక్కవర్షం కూడా కురవకపోగా.. ఎండలు బెంబేలెత్తుతున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు పత్తి విత్తనాలు నాటారు. ప్రస్తుతం చినుకులు రాకపోవడం.. ఎండ వేడి తగ్గకపోవడంతో మొలిచిన మొలకలు ఎండిపోతున్నాయి. చినుకు కోసం అన్నదాతలు కలవరపడుతున్నారు. పలు ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు లేకపోవడంతో జిల్లావ్యాప్తంగా సాగు పనులను రైతులు మొదలుపెట్టడం లేదు. జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో ఇంకా గరిష్ఠ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి.

నీటి లభ్యత ఉన్నచోట సాగు..

వ్యవసాయ బావులు, బోర్లలో నీటి లభ్యత ఉన్న రైతులు జిల్లాలో అక్కడక్కడ కొంత పత్తి సాగు చేశారు. అయితే వర్షాలు రాకపోవడంతో వేసిన పత్తి ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మొక్కలను కాపాడుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. బిందెలతో నీరు తెచ్చి పోయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బిందెలతో ఎంత నీరు పోసినా.. వెంటనే ఎండిపోతుండడంతో రైతులు మబ్బులవైపు చూస్తున్నారు.

నార్లు పోసేందుకు ఎదురుచూపులు..

వానకాలంలో సాధారణంగా ఇంటికి అవసరమైన బియ్యం కోసం రైతులు సన్నాలను అధికంగా సాగు చేస్తారు. అలాగే జొన్నసాగు కూడా చేస్తారు. కానీ.. చెప్పుకోదగ్గ వర్షం ఒక్కటీ లేకపోవడంతో ఇప్పటివరకు సన్నరకాల వడ్లు కూడా నార్లు పోయలేదు. తేలికపాటి వర్షం కురిసిన.. నీటి వసతి ఉన్న కొన్ని ప్రాంతాల రైతులు పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేసినా.. అవి కూడా సక్రమంగా మొలకెత్తలేదు. కొన్ని ప్రాంతాల్లో మొలకెత్తినా నీటితడులు లేక వాడిపోతున్నాయి. రోహిణి కార్తె ముగిసి.. మృగశిర కార్తె దాటిపోయే సమయం వచ్చింది. సాధారణంగా ఈ కార్తెల్లో విత్తనాలు వేసుకుంటేనే మంచి దిగుబడులు వస్తాయని రైతుల విశ్వాసం. జిల్లాలో గతేడాది సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. వరి, పత్తి పంటలు కూడా సాధారణ విస్తీర్ణానికి మించి సాగు అయ్యాయి. జిల్లాలోనే 2,83,3,321 ఎకరాలకు మించి సాగు చేస్తారు. ఈ ఏడాది మాత్రం ఇప్పటివరకు వర్షాలు కురవకపోవటంతో పంటల సాగు విస్తీర్ణంలోనూ వ్యత్యాసాలు ఉండే అవకాశముందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. చిన్నపాటి వర్షాలకు విత్తనాలు వేయొద్దని, ఎక్కువ వర్షం కురిసిన తరవాతనే నాటుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి రైతులకు సూచించారు.

ఖరారుకాని ప్రణాళిక..

ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వానాకాలం సీజన్ ప్రారంభమైనా బ్యాంకులు ఇంకా రుణ ప్రణాళికను ఖరారు చేయలేదు. జిల్లాల్లోనూ బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేసి ఈ ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్లలో జిల్లాలోని అన్నదాతలకు ఎంత రుణాలివ్వాలనేది నిర్ణయిస్తాయి. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు రుణ ప్రణాళికను ఖరారు చేయకపోవడంతో అన్నదాతలు పెట్టుబడి కోసం షావుకార్లను ఆశ్రయిస్తున్నారు. రైతుబంధు కింద ప్రభుత్వం ఈ నెలాఖరులో రైతుల ఖాతాల్లో పెట్టుబడి డబ్బులు జమ చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఏటా ఈ సమయానికి తొలకరి వర్షాలు పడి రైతులు దుక్కులు దున్నుకునే కాలం. కానీ ఈ సారి రుతుపవనాలే ప్రవేశించకపోవడంతో ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులను తట్టుకోవడానికి ప్రభుత్వం ఈ దఫా పంట కాలాన్ని ముందుకు జరపాలని నిర్ణయించినా.. ఇప్పటి వరకు ఆశించినంత మేర వర్షాలు లేవు.

> **ఎదురుచూస్తున్న**
>
> 
>
> జొన్న సాగు చేసే సమయం దాటింది. పత్తి విత్తనాలు నాటుదామనుకుంటే ఇంకా దుక్కి చేయలేదు. విత్తనాలు నాటేందుకు ప్రతిరోజూ వర్షం కోసం ఎదురు చూస్తున్నాం. వర్షం కురవకపోవడంతో ఏ పంట సాగు చేయాలో తోచడంలేదు.
>
> – సదయ్య, రైతు

మరమ్మతుకు నోచని ఎస్సారెస్పీ కాలువలు

- చెట్లు, గండ్లతో ఉనికి కోల్పోతున్న వైనం
- గట్ల ఆక్రమణలు.. సాగుకు లెవలింగ్
- పట్టించుకోని ఎస్సారెస్పీ అధికారులు





అబ్బాపూర్ వద్ద 8ఆర్ మైనర్ కాలువలో ఏపుగా పెరిగిన చెట్ల పొదలు, కొత్తూరు వద్ద శ్రీరాంసాగర్ డి-83 ప్రధాన కాలువ

జూలపల్లి: తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువలు చెట్లు, గండ్లు, ఆక్రమణలతో ఉనికి కోల్పోతున్నాయి. తెలంగాణకే అన్నం పెట్టిన ప్రాజెక్టు కాలువలపై దృష్టి పెట్టకపోవడంతో మైనర్ కాలువల నుంచి చివరి భూములకు సాగునీరు చేరక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో డి–83, డి–86 ప్రధాన కాలువల ద్వారా ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న శ్రీరాంసాగర్ కాలువలను ఎవరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. కొత్త ప్రాజెక్టులు, కాలువలకు ఇచ్చిన ప్రాధాన్యత శ్రీరాంసాగర్‌కు ఇవ్వకపోవడంతో ప్రాజెక్టు ద్వారా భూముల పారకం ప్రశ్నార్థకం అవుతోంది.

కాలువల కింద ఆయకట్టు

డి–83 కాలువ రెవెల్లి డిస్ట్రిబ్యూటర్ నుంచి గుండారం రిజర్వాయర్ వరకు 35.5 కిలోమీటర్ల మేర వెళ్తుండగా 27 మైనర్ కాలువలు, సబ్ కాలువల ద్వారా పంట భూములకు నీరందిస్తుండగా.. లక్షా ఆరు వేల ఎకరాలు పారుతున్నట్లు ఎస్సారెస్పీ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. డి–86 కెనాల్ ద్వారా 86 వేల ఎకరాల ఆయకట్టు సాగువుతున్నట్లు అంచనా. ఏళ్లు గడచినా ప్రధాన కాలువలు ఆధునీకరణకు నోచుకోవడం లేదు. ఉపకాల్వల పరిస్థితి చెట్లు, గండ్లతో ఉనికి లేకుండాపోతున్నాయి. అధికారులు కొత్త ప్రాజెక్టులపై చూపిన ఆసక్తి శ్రీరాంసాగర్ ఆధునీకరణపై చూపించడం లేదని రైతులు అంటున్నారు. సాగునీటి సంఘాలు ఉన్నప్పుడు కొంతవరకు రిపేర్లు చేసినా.. ప్రస్తుతం సంఘాలు ఉనికిలో లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు.

మైనర్ కాలువలకు గండ్లు, ఆక్రమణలు

మైనర్ కాలువల నుంచి పొలాలకు వచ్చే సాగునీరు చివరి భూములకు రావడం లేదు. కాలువ గట్లను ఆక్రమించి సాగు చేస్తూనే ఎవరి పొలాలకు వాళ్ల దగ్గరే గండ్లు పెట్టి పారించుకుంటుండడంతో చివరిభూముల సాగు కష్టమవుతోంది. నీటిని తీసుకెళ్లే క్రమంలో రైతులు గొడవలకు దిగుతున్న సంఘటనలు ఉన్నాయి. ఆక్రమణలు, గండ్లు పెట్టకుండా అధికారులు కట్టడి చేస్తే చివరి భూములకు కాలువ నీళ్లు అందే అవకాశం ఉంటుంది. దీంతో పంటలు ఎండకుండా కాపాడుకోవచ్చు. ప్రభుత్వం శ్రీరాంసాగర్ కాలువలను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాలువ నీళ్లు అందుతలేవు



చిన్న కాలువలో చెట్లు బాగా పెరిగి చివరన ఉన్న భూముల వరకు నీళ్లు రావడం లేదు. కాలువలో మట్టి పూడుకుపోయి నీళ్లు తక్కువ వస్తున్నాయి. చాలా ఏళ్ల నుంచి కాలువను ఎవరూ పట్టించుకోవడం లేదు. మరమ్మతు చేస్తే సాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయి.

– అట్ల రాజు, రైతు, వడ్కాపూర్

ఎవరూ పట్టించుకుంటలేరు



గండ్లు పెట్టినా.. చెట్లు ఏపుగా పెరిగినా కాలువలను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో కాలువ నీళ్లు చాలా తక్కువ వస్తున్నాయి. రోజు కాలువ వెంబడి తిరిగినాగానీ.. నీళ్లు పారడంలేదు. గండ్లు పెట్టవద్దంటే ఎవరూ వినడం లేదు. అధికారులు కాలువలను చూసి మరమ్మతు చేయించాలి.

– బండారి శంకర్, రైతు, జూలపల్లి

మరమ్మతు చేయడం లేదు



ఎన్నో ఏళ్లుగా కాలువలు రిపేరు చేయకపోవడంతో చెట్లు, పెరిగి గతంలో సిమెంట్ చేసింది పోతోంది. ఎప్పటికప్పుడు చెట్లను తొలగిస్తే నీటి పారకం ఇబ్బంది లేకుండా పారేది. దీనికితోడు ఎక్కడపడితే అక్కడ గండ్లు పెట్టడంతో చివరి భూములకు నీరు వచ్చుడు చాలా కష్టమవుతోంది.

– కుంట రాజేశ్వర్ రెడ్డి, రైతు, కుమ్మరికుంట

డ్రాఫ్టులు కూలితే కడుతున్నాం



మైనర్ కాలువలకు డ్రాపులు కూలితే వెంటనే కడుతున్నాం. కాలువల్లో సిల్ట్, ముళ్లపొదలు ఈజీఎస్ ద్వారా చేయించుకోవాలని చెబుతున్నాం. కాలువలు పూడుకుపోతే ఈజీఎస్ పథకంలో చేయించుకోవాలి. ప్రత్యేక నిధులు ఉండవు. రైతులు ఈజీఎస్ అధికారులకు చెబితే తీర్మానం చేసి పనులు చేయిస్తారు.

– కే.శ్రీనివాస్, ఈఈ, నీటిపారుదల శాఖ ఐదో డివిజన్, పెద్దపల్లి

దాహార్తి తీర్చుతున్న మిషన్ భగీరథ



ముర్మూర్‌లోని వాటర్ ప్లాంటు వద్ద ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ సంగీత

- 'మిషన్' శుద్ధజలాలతో రోగాలకు చెక్
- ముర్మూర్ నీటిశుద్ధి కేంద్రంలో మంచి నీటి పండుగ
- ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్
- గ్రిడ్ ఆవరణలో మొక్కలు నాటిన కలెక్టర్ సంగీత



మొక్కలు నాటుతున్న కలెక్టర్ సంగీత

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి రాష్ట్రంలో తాగునీటికి కటకట, కలుషిత జలాలతో వ్యాధులబారిన పడుతూ ప్రజలు అనుభవించిన కష్టాలకు తెలంగాణ వచ్చాక మిషన్ భగీరథతో తెర పడిందని పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంతర్గాం మండలం ముర్మూర్‌లో మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్ ఆవరణలో తెలంగాణ మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులకు ముర్మూర్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను చూపించారు. ప్లాంట్ ప్రాంగణంలో కలెక్టర్ సంగీతతో కలిసి మొక్కలు నాటారు. మిషన్ భగీరథ రాష్ట్ర ప్రజానీకానికి ఒక వరమన్నారు. ఇంటింటికీ తాగు నీటి సరఫరాపై రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద మహిళల కుస్తీలు పట్టేవారని, పట్టణాల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉండేవని వివరించారు. తాగునీటి గోస తీర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు తెలిపారు. జిల్లాలో దాదాపు 2వేల కిలోమీటర్లకుపైగా పైప్‌లైన్ వేసి, 321 ఓవర్ హెడ్‌ట్యాంకుల ద్వారా శుద్ధ నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, మిషన్ భగీరథ జిల్లా గ్రిడ్ అధికారి కె.పూర్ణచందర్, ఇంట్రా అధికారి శ్రీనివాస్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఫణీంద్ర, డీఆర్‌డీఓ శ్రీధర్, డీపీఓ చంద్రమౌళి, ఎంపీపీ లు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే అందరికీ ఇళ్లు

- రూ.500లకే గ్యాస్ సిలిండర్
- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ వెల్లడి



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం 23వ డివిజన్‌లో హాథ్‌సేహాథ్ జోడో అభియాన్ యాత్ర చేపట్టారు. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటివరకు రూ.మూడు వేల భృతి అందిస్తామని పేర్కొన్నారు. యువతులకు ఎలక్ట్రానిక్ స్కూటీలు ఇచ్చి వారి భవిష్యత్తుకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, కొత్తగా ఇల్లు కట్టుకునేందుకు రూ.ఐదు లక్షలు అందిస్తామని ప్రకటించారు. రెండు నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు డబ్బులు జమకాకపోయినా.. స్థానిక ఎమ్మెల్యేకు సోయి లేకుండాపోయిందన్నారు. 23వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సావిత్రి హయాంలోనే అభివృద్ధి జరిగిందని, ఆమె చనిపోయినప్పటి నుంచి పనులు చేయడం లేదని, కనీసం ఉప ఎన్నిక కూడా నిర్వహించలేని అసమర్థ ఎమ్మెల్యేకు చరమగీతం పాడాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు తంగళ్లపల్లి ప్రకాష్, మురళీకృష్ణ, ముచ్చకుర్తి రమేశ్, పార్టీ ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, కార్పొరేటర్లు మహంకాళీ స్వామి, ఎండీ.ముస్తఫా, గాధం విజయ పాల్గొన్నారు.

గోదావరిఖనికి చేరుకున్న జీపుజాతా




ఖనిలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రారంభించిన జీపుజాత ఆదివారం గోదావరిఖని చేరుకుంది. తెలంగాణ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.పద్మ, కార్యదర్శి జయలక్ష్మి, కోశాధికారి కే.సునీతకు ఏఐడీడబ్ల్యూఏ, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు స్వాగతం పలికారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టీచర్లకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణకుమార్, సురేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్‌లతో పెరిగిన పనిభారం

పెద్దపల్లిరూరల్: జీపుజాతాలో పాల్గొన్న నాయకులు జిల్లాకేంద్రంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, ఆరోగ్యలక్ష్మి మెనూ ఛార్జీలను ధరలకనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. స్థానిక అమర వీరుల స్తూపం వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ పెన్షన్ సౌకర్యం కల్పించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలి



పూసాలలో పర్యటిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: ఉద్యమకారులకు తొమ్మిదేళ్లలో తగిలిన గాయాలు గుర్తు చేసేందుకే రాష్ట్రప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు ఆరోపించారు. సుల్తానాబాద్‌లోని స్వప్నకాలనీ, పూసాలలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, వచ్చే ఎన్నికల్లో వాటిని గద్దె దించాలని సూచించారు. అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఐదేళ్లవుతోందని, కొత్తరేషన్‌కార్డులు, రుణమాఫీ ఊసేలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ యువతకు రూ.4వేల భృతి ఇస్తామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, మాజీ సర్పంచులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు, దన్నాయక్, దామోదర రావు, మండల అధ్యక్షుడు చిలుక సతీష్, నాయకులు నోముల శ్రీనివాస్ రెడ్డి, సాయిరి మహేందర్, దున్నపోతుల రాజయ్య పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో పనిచేసి బదిలీపై వెళ్లిన సీఐలు ప్రదీప్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు రాజేశ్, ఉపేందర్, రాజవర్ధన్‌లను ఆదివారం ఏర్పాటు చేసిన ఏసీపీ మహేశ్ సత్కరించారు. కార్యక్రమంలో సీఐలు అనిల్‌కుమార్, జగదీశ్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, మధుకర్, ప్రమోద్, సతీశ్, ఎస్సైలు మహేందర్, విజయేందర్, రామకృష్ణ, వెంకటకృష్ణ, శ్రీనివాస్, వినీత, అశ్విని, వెంకటేశ్, సహదేవ్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

చికిత్సపొందుతూ యువకుడి మృతి


సంతోష్(ఫైల్)

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి కూచిరాజ్‌పల్లిలో దాసరి సంతోష్(28) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్సపొందుతూ శనివారం అర్ధరాత్రి తర్వాత మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. సంతోష్ తన తమ్ముడికి వివాహం కాగా, తనకు మాత్రం కావడం లేదని బాధతో తాగుడుకు బానిసై ఏం పనిచేయడం లేదు. ఈ నెల 16న గ్రామ శివారులోని నందికట్ట ప్రాంతంలో మద్యం సేవించి తర్వాత గడ్డి మందు తాగాడు. విషయం తన మిత్రుడికి చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి..


అంజయ్య(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ సంతోష్‌నగర్‌కు చెందిన ఎరుకల అంజయ్యగౌడ్(61) నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. గోదావరిఖని-2టౌన్ పోలీసుల వివరాలు.. ఈ నెల 16న రాత్రి 8గంటల సమయంలో అంజయ్య గోదావరిఖని నుంచి యైటింక్లయిన్‌కాలనీ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, యైటింక్లయిన్‌కాలనీ నుంచి గోదావరిఖని వస్తున్న పెండం కళ్యాణ్‌కుమార్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజయ్యను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్‌రెడ్డి తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య


వెంకటరాజం(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: జనగామ గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు నీలం వెంకటరాజం (82) ఆదివారం తన ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గోదావరిఖని రెండో పట్టణ పోలీసులు తెలిపారు. 20ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందిన వెంకటరాజం భార్యతో కలిసి జనగామలో నివాసముంటున్నాడు. ఈ ఏడాది జనవరిలో భార్య అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటూ.. అప్పుడప్పుడు తన కుమార్తె దగ్గరకు వెళ్లి వస్తుండేవాడు. ఆదివారం ఇంట్లో విగతజీవిగా మారడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమార్తె, బంధువులు వచ్చి చూడగా అప్పటికే వెంకటరాజం మృతి చెంది ఉన్నాడు. ఆయన మృతదేహాన్ని సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు అందిస్తున్నట్లు మృతుడి కుమార్తె, అల్లుడు తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థి..

ధర్మారం(ధర్మపురి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామానికి చెందిన విద్యార్థి కుందేళ్ళ చందు (19) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. చందు ఇంటర్ పూర్తి చేశాడు. తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేక తాను పై చదువులు చదవలేననే బెంగతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

చెరువులు, కుంటలు కబ్జా


గర్రెపల్లి ఎఫ్‌టీఎల్ భూముల్లో వెంచర్


ఎఫ్‌టీఎల్ భూముల్లో వెంచర్ల కోసం వేసిన రోడ్డు

- ఎఫ్‌టీఎల్ భూముల్లోనూ వెంచర్లు
- సర్వేచేసి హద్దులు నిర్ణయించాలన్న ప్రభుత్వం
- అయినా పట్టని అధికారయంత్రాంగం
- భారీ వర్షాలు కురిస్తే ముప్పు తప్పదంటున్న స్థానికులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): తెలంగాణ వచ్చాక మారుమూల ప్రాంతంలో కూడా భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఎకరా భూమి రూ.లక్షలు, కోట్లు పలుకుతుండగా ఇదే అదనుగా భావించిన కబ్జాదారులు చెరువులు, కుంటలు, అసైన్డ్ భూములను కబ్జా చేస్తున్నారు. ఒకప్పుడు విశాలంగా ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణలతో కుదించుకుపోతున్నాయి. జిల్లాలోని 14 మండలాల్లో దాదాపు 1,084 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటికి సరైన హద్దులు లేకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయి.

ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాలు

భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువు నిండి అలుగు పారే గరిష్ఠ నీటిమట్టాన్ని ఎఫ్‌టీఎల్ అంటారు. ఆ సమయంలో ఎంత వరకు భూమిలో నీరు విస్తరించి ఉంటుందో ఆ మేరకు చెరువు భూమిగా గుర్తించి నీటి పారుదల శాఖ ఎఫ్‌టీఎల్‌గా పరిగణిస్తుంది. ఎఫ్‌టీఎల్ నుంచి 30మీటర్ల వరకు ఉండే పరిధిని బఫర్ జోన్‌గా పరిగణిస్తారు. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎఫ్‌టీఎల్ భూములు కబ్జాకు గురికాకుండా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేసి కబ్జాలను నిరోధించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

గ్రామీణ జీవనానికి తోడ్పాటు

భూగర్భ జలాల పెంపునకు, సాగు, తాగునీటి అవసరాలకు చెరువులు, కుంటలు ఎంతో దోహదపడుతాయి. వర్షాలతో చెరువులు, కుంటలు నిండిన ప్రతిసారి ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను చెరువులు, కుంటల్లో వదలడంతో లక్షలాది మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. అంతేగాక పశు సంపదకు తాగునీటి అవసరాలను తీరుస్తుండటంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో బలమైన సంబంధం కలిగి ఉందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

హద్దులు నిర్ణయించాలని ఆదేశాలు

చెరువు, కుంటల శిఖం, ఎఫ్‌టీఎల్ భూములను ఆక్రమించుకుంటున్నారని, ఎఫ్‌టీఎల్ భూములను ధరణి వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుంటున్నారన్న విషయం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఉన్నతాధికారులకు రెండేళ్ల క్రితమే ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. కానీ అమలుకు నోచుకోలేదు. సిబ్బంది కొరతతో చెరువులు, కుంటల శిఖం, ఎఫ్‌టీఎల్ భూములను సర్వే చేయడం లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇదే అదనుగా తీసుకొని కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడుతూనే ఉన్నారు.

సిబ్బంది కొరతతో ఆగిన సర్వే

సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ సర్వేయర్ల కొరతతో సర్వే ఆలస్యం అయ్యింది. రెవెన్యూ శాఖతో కలిసి సంయుక్తంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరుగుతుంది.

– సత్యరాజ్ చంద్ర, ఎస్సారెస్పీ ఎస్‌ఈ, పెద్దపల్లి

హద్దులు నిర్ణయించాలి



చెరువులు, కుంటల విస్తీర్ణాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణాయించాలి. మత్స్యకార్మికులకు చెరువులతోనే జీవనోపాధి. చెరువు శిఖాలు ఆక్రమణకు గురవడంతో విస్తీర్ణం తగ్గుతుంది. సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఇదివరకే అధికారులకు వినతి పత్రాలు సమర్పించడం జరిగింది.

– శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి, సుల్తానాబాద్

మున్నూరుకాపు నిత్యాన్న దాన సత్రానికి తోడ్పడాలి

- ట్రస్టు బోర్డు ఛైర్మన్ ఉప్పు రవీందర్ పటేల్


సత్యంకు నియామకపత్రాన్ని అందిస్తున్న రవీందర్

కమాన్‌పూర్: సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి దాతలు ధర్మకర్తలుగా ముందుకు వచ్చి తోడ్పాడాలని ట్రస్టు బోర్డు ఛైర్మన్ ఉప్పు రవీందర్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో మున్నూరుకాపు నిత్య అన్నదాన సత్రం ఏర్పాటుకు కులబాంధవులు సహకరించాలని, విరాళాలు సేకరించడానికి కమాన్‌పూర్ నుంచి బోనాల సత్యం, మంథని నుంచి ఎడ్ల సంతోష్‌ను నియమించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూముల శ్రీనివాస్, ముకుంద అనిల్, నీలం శ్రీనివాస్, ఆకుల బాపు, అర్ష ఎలయ్య, టిక్కం కుమార్, కావేటి గోపాల్ కిషన్, బోనాల స్వామి, టిక్కం గోపాల్, పొన్నం శ్రీనివాస్, దండె సదయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లు ఆలస్యం..


రామగుండంకు అర్ధరాత్రి చేరుకున్న భాగ్యనగర్ రైలు

- అధికారుల వైఖరిపై ప్రయాణికుల విమర్శలు

రామగుండం: సాధారణ, మధ్య తరగతి ప్రజలు తక్కువ ఖర్చు.. భద్రతతో కూడిన రైలులో సకాలంలో గమ్యం చేరేందుకు ప్రయాణిస్తుంటారు. అయితే ప్రస్తుతం ప్యాసింజర్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖాజీపేట–సిర్పూర్ కాగజ్‌నగర్, నిజామాబాద్– సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే రామగిరి, పుష్‌పుల్, ఇంటర్‌సిటీ, సింగరేణి ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. 98 కిలోమీటర్ల దూరంలో కాజీపేట, 220కిలోమీటర్ల దూరంలో ఉన్న సికింద్రాబాద్, నిజామాబాద్ వెళ్లేందుకు పొద్దస్తమానం పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రయాణికులు అంటున్నారు.

ట్రాక్ పనులు చేపడితే రద్దే..

కరీంనగర్, కాజీపేట– కాగజ్‌నగర్ మధ్య రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడితే గతంలో ఒకటి రెండు రైళ్లను నడిపించిన రైల్వేశాఖ.. ప్రస్తుతం వారం రోజుల పాటు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తోంది. ఆర్టీసీ బస్సు చార్జీలతో పోల్చితే నాలుగోవంతు రైలు చార్జీలు ఉండడంతో సాధారణ, నిరుపేద ప్రయాణికులు రైలు ప్రయాణానికే మొగ్గు చూపుతారు. కాగా గంటల తరబడి రైళ్ల ఆలస్యంతో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎక్స్‌ప్రెస్, గూడ్సులకే మొదటి ప్రాధాన్యం

క్రమంగా పెరుగుతున్న రైళ్ల సంఖ్యకు అనుగుణంగా రైల్వే ట్రాక్స్ విస్తరిస్తున్న రైల్వేశాఖ ప్యాసింజర్ రైళ్ల రాకపోకలపై మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. ప్యాసింజర్ రైలు రాకపోకలు సాగించే క్రమంలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లు మొదటగా పంపించేందుకు వీటిని గంటల తరబడి నిలిపివేస్తుండడంతో సాధారణ ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. గూడ్స్ రాకపోకలతో వందలాది కోట్ల ఆదాయం ఉండగా, రైల్వేశాఖ సేవా దృక్పథాన్ని మరిచి లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుందనే విమర్శలు మూటగట్టుకుంటుంది.

ప్రభుత్వ భూములను పేదలకు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జ్యోతినగర్(రామగుండం): కబ్జాలకు గురవుతన్న ప్రభుత్వ భూములను రక్షించి పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ వేల్పుల కుమారస్వామి అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండంలోని ఇందిరమ్మకాలనీ, న్యూపీకే రామయ్య కాలనీలోని భూ పోరాట కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల నుంచి గుడిసెలు వేసుకొని నిరీక్షిస్తున్న ప్రజల గుడిసెలు తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇందిరమ్మకాలనీ ఏరియాలో సర్వే నంబర్ 610, 612, 617లో ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని, ఫిర్యాదు చేసినా కనీసం స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. తహసీల్దార్ పేదలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. ఇళ్లు లేని పేదలకు 125 గజాల స్థలం కేటాయించి, నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చే వరకు భూ పోరాటాలు ఆగవని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల సాధనకు ఈ నెల 19న మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో భూ పోరాట కేంద్రాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రామాచారి, లక్ష్మారెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

పాలీసెట్ ధ్రువపత్రాల పరిశీలన


అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలోని పీజీ కళాశాలలో 2023 సంవత్సరానికి సంబంధించిన పాలీసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమాకాంత్ తెలిపారు. ఆదివారం 185మంది హాజరయ్యారని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్, జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. వెరిఫికేషన్‌లో పాలీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ కో–ఆర్డినేటర్ డి.సురేష్‌కుమార్, అధికారులు రమేశ్ ప్రసాద్, అజయ్, సావిత్రి, యాదయ్య పాల్గొన్నారు.

ఏఎల్‌పీ గని సందర్శన


డీసీపీని సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ గనిని ఆదివారం పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ సందర్శించారు. గనిలోపలి పని ప్రదేశాలు, బొగ్గు తీసే యంత్రాలు, రక్షణ చర్యలు గురించి తెలుసుకున్నారు. పనుల వివరాలు, యంత్రాల తీరును డీసీపీకి జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు వివరించారు. ఈసందర్భంగా గనిలో అత్యంత టెక్నాలజీని ఉపయోగిస్తూ బొగ్గు ఉత్పత్తి చేసే విధానం బాగుందని డీసీపీ పేర్కొన్నారు. అనంతరం గని ఆవరణలోని కార్యాలయంలో డీసీపీని శాలువాలతో సన్మానించారు. డీసీపీ వెంట మంథని సీఐ సతీష్, రామగిరి ఎస్సై రవిప్రసాద్, ఎస్‌వోఎం జనార్దన్ తదితరులున్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2014 నుంచి కోల్ ఇండియాలో చెల్లిస్తున్న హై పవర్ కమిటీ వేతనాలు కోల్ ఇండియా సర్క్యులర్ ప్రకారం సింగరేణిలో చెల్లించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన చర్చల్లో బోనస్ పెంచుటకు ఒక నెల రోజుల లోపు కమిటీ వేసి పర్యవేక్షించి చర్యలు తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంలో జాప్యం చేస్తే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. సమావేశంలో కేంద్ర ఉపాధ్యక్షుడు సారంగపాణి, కేంద్ర కమిటీ సభ్యులు మాదాసు రవీందర్ పాల్గొన్నారు.

చెట్టు నరికిన వ్యక్తికి జరిమానా

మంథని: మంథని మున్సిపాలిటీలోని ఓ హోటల్‌కు అడ్డుగా ఉందని చెట్టును నరికిన వ్యక్తికి అటవీ శాఖ అధికారులు రూ.3,318 జరిమానా విధించారు. చెట్టు నరుకుతున్న వీడియోను తీసి అధికారులకు ఫిర్యాదు చేయడంతో అటవీ, మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

పైపులైన్ లీకేజీతో దారి మూసివేత



రామగుండం: అంబేద్కర్ కూడలి.. రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిలో బీ–థర్మల్ కేంద్రం విద్యుత్ ఉత్పాదన నిమిత్తం వినియోగించే రా వాటర్ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. తాత్కాలికంగా మరమ్మతు చేస్తున్నా.. వెంటనే లీకేజీలు ఏర్పడుతున్నాయి. కొద్దిరోజుల క్రితం కూడా పైపులు పగిలిపోవడంతో దారిని మూసివేశారు. యాభై ఏళ్ల క్రితం వేసి పైపులైన్ కావడంతో తుప్పుపట్టి పైపులు ఎక్కడికక్కడ విరిగిపోతుండడంతో పునరుద్ధరణ పనులు కష్టంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు.

ట్రినిటీ విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ(అడ్వాన్స్‌డ్) ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారు. ఎ.అభిరామ్ 415వ ర్యాంకు, ఎస్.సాచి 800, జి.దిలీప్ 908, కె.గోపాల్ 1,017, జి.గంగాధర్ 1,117, ఎం.రాజారెడ్డి 1,137, ఎస్.సుహాస్‌రెడ్డి 1,430, పి.అభినయ 1,674వ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్ అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం


పల్లె బిందు


పవన్ సూర్య


శ్రీవాత్సవ


సాయిప్రభాస్

కరీంనగర్: జేఈఈ మెయిన్స్ –2023 ఫలితాల్లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరచి జాతీయస్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ఎన్.పవన్ సూర్య 903వ ర్యాంకు, పల్లె బిందు 2,467, మారుపాక శ్రీవాత్సవ 3,159, కల్వల సాయిప్రభాస్ 4,295వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, అంకితభావంతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో శ్రీచైతన్య విద్యా సంస్థలు నడుస్తున్నాయని వివరించారు. శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ జూనియర్ కళాశాల స్థాపించిన నాటి నుంచి రాష్ట్రస్థాయి ర్యాంకులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కళాశాలల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఐఐటీ ఫలితాల్లో శ్రీచైతన్య ఐపీఎల్ ప్రతిభ

కరీంనగర్: జేఈఈ అడ్వాన్స్–2023 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్‌లోని శ్రీ చైతన్య ఐపీఎల్ విద్యార్థులు సత్తాచాటారు. జిందం శ్రీనాథ్ ఆల్ ఇండియా 151వ ర్యాంక్, ఎం. రిషికేష్ ఆల్ఇండియా 158వ ర్యాంక్ సాధించారు. ఏ.శశిధర్ 902, టి.మణిశరవన్‌గౌడ్ 11,24, బి.అరిస్‌పటేల్ 1,726, ఎస్.సాయికృష్ణ 4,548, ఎం.హరిత్ 5,076, పి.కీర్తి 6,012, జె.శ్రీజ 8467 ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం లక్ష్మణరావు, ఆర్‌ఐ రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్, ఐపీఎల్ ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జి మధుకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అక్రమాలపై ప్రశ్నిస్తే దాడి చేస్తారా?


పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వివేక్

ధర్మారం(ధర్మపురి): చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీల వేబిల్లు అడిగిన బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి బీమారపు సంపత్‌పై కాంట్రాక్టర్ అనుచరులు దాడి చేయడం అన్యాయమని పెద్దపల్లి మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు వివేక్ అన్నారు. దాడి సమాచారం తెలుసుకున్న ఆయన నేరుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ, మండలంలోని రచ్చపల్లి శివారులో చెరువు నుంచి కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తుంటే ప్రశ్నించిన సంపత్‌పై అధికార పార్టీ అండతో దాడి చేయడం ఎంత వరకు న్యాయమన్నారు. మట్టి దందాపై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు సంపత్ ఫిర్యాదు చేశాడని తెలిపారు. టీఆర్‌ఎస్ నాయకులు అక్రమంగా మట్టిని తరలిస్తూ కోట్లాది రూపాయలు పోగు చేసుకుంటున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడినవారిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కేసు నమోదు

సంపత్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మట్టి లోడ్‌తో వెళ్తున్న లారీ వే బిల్లు అడిగిన సంపత్‌పై జయ్యారం గ్రామానికి చెందిన గంగాధర రమేష్‌తో పాటు మరికొంత మంది కులంపేరుతో తిడుతూ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.